క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పద్మావతి

ఏలూరు (టూటౌన్): గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్య సమతుల్యతను సాధించవచ్చని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి కేవీఎల్ పద్మావతి అన్నారు. పోషణ పక్వాడా పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక పవరేపేట యూపీ స్కూల్లో ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీడీ పద్మావతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తాము తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. పౌష్టికాహారం గురించి వివరించారు. ఎంఈఓ రంగయ్య, తంగెళ్లమూడి యూపీహెచ్‌సీ డాక్టర్ కిరణ్‌లు మాట్లాడుతూ పౌష్టికాహార ప్రాధాన్యత, అంగన్‌వాడీల్లో ప్రీ స్కూల్ ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పిల్లలను పంపించిన తల్లులను సన్మానించారు. ఈ సందర్భంగా వెల్ బేబీ షో నిర్వహించి చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్స్ ఎం.మౌనిక, బి.మంగ, సత్యవతి, జోషి, భీమారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారు ప్రమాదం

ఏలూరు టౌన్ : ఏలూరు శివారు వట్లూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం రెండు కార్లు ఢీకొన్నాయి. మద్యం మత్తులో కారును అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న మరో కారును ఢీ కొట్టడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడలోని గొల్లపూడికి చెందిన బోడావుల సోమేశ్వరరావు ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా విజయవాడ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం తన కుమారుడు చంద్ర, తమ్ముడు నాగబాబు కలిసి తమ కారులో ఏలూరు వస్తున్నారు. వట్లూరు రైల్వే బ్రిడ్జిపై వస్తుండగా ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వస్తూ వీరి కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న సోమేశ్వరరావు, ఆయన కుమారుడు చంద్ర, ఆయన తమ్ముడుకు తీవ్ర గాయాలయ్యాయి. ఢీకొన్న కారులో డ్రైవర్‌తో పాటు నలుగురు వ్యక్తులు మద్యం సేవించి ఉన్నారు. గాయాల పాలైన ఈ ముగ్గురిని 108 అంబులెన్సులో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌తో పాటు ముగ్గురు ఆసుపత్రికి రాగా వారి నుంచి రక్తనమూనాలు సేకరించాలని ఆసుపత్రి వైద్యులను కోరారు. దీంతో వారంతా హాస్పటల్ నుంచి పరారీ అయినట్లు తెలుస్తోంది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

పేదల స్వగృహానందం

- కాలనీల్లో 1,088 ఇళ్ల నిర్మాణం పూర్తి
- 15 గ్రామాల్లో రూ.12.77 కోట్లు అందజేత



ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదల్లో స్వగృహానందం వెల్లివిరుస్తోంది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు ఎందరో సొంతిల్లు కట్టుకుని సంతోషంగా జీవిస్తున్నారు. దీనికి కారణం పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి నిలపడమే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హౌసింగ్ శాఖకు కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తున్నారు. 2023 నవంబర్ నెలాఖరి నాటికి ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో 1088 మంది సొంతిల్లు నిర్మించుకున్నారు. వీరికి ప్రభుత్వం రూ.12,77,81,000 అందజేసింది. గ్రామాల వారీగా చాటపర్రులో రూ.2,96,35,873, పైడిచింతపాడు రూ.81,96,482, ప్రత్తికోళ్లలంక రూ.1,25,93,456, కేడీపురం రూ.32,81,459, కోమటిలంక రూ.26,12,393, శ్రీపర్రు రూ.1,09,08278, పెదయాగనమిల్లి రూ.15,00,000, గుడివాకలంక రూ.6,54,6651, జాలిపూడి రూ.2,02,21,461, మల్కాపురం రూ.1,91,57,344, మాదేపల్లి గ్రామంలో రూ.1,31,28,091 ప్రభుత్వం అందజేసింది.



శనివారపుపేట జగనన్నకాలనీలో ఓ మహిళ నిర్మించుకున్న ఇల్లు



చాటపర్రులో ఓ ఇంటి ఎలివేషన్‌పై ఏర్పాటుచేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం

నాలుగు దశల్లో నగదు మంజూరు

ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు అధికారులు క్రమంతప్పకుండా నిధులు మంజూరు చేస్తున్నారు. కాలనీల వద్దకే ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉంచుతున్నారు. పనులు ప్రారంభం కాగానే బేస్‌మెంట్ లెవెల్‌లో రూ.70 వేలు, రూఫ్‌లెవెల్‌లో రూ.37,600, రూఫ్ కాస్ట్ రూ.21,200, నిర్మాణం పూర్తయ్యే దశలో రూ.21,200 లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీనికితోడు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల వేతనం రూ.30 వేలు అందిస్తున్నారు. మరో రూ.30 వేలు డ్వాక్రా సంఘాల నుంచి అప్పుగా ఇప్పిస్తున్నారు.

అధికారులు ప్రత్యేక శ్రద్ధ

ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ అధికారులతో పాటు మండల పరిషత్, ఇంజినీరింగ్ శాఖాధికారులతో పాటు సచివాలయ సిబ్బంది సైతం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. లబ్ధిదారులను కలుసుకుని వారికి అవసరమైన రోడ్లు, నీటి వసతులు కల్పిస్తున్నారు.



జాలిపూడి జగనన్నకాలనీలో నిర్మించిన ఇళ్లు

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పుణ్యంతో మా సొంతింటి కల నెరవేరింది. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం మా గోడు పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ పాలనలో మాకు ఇంటి స్థలం వచ్చింది. ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. వెంటనే ఇంటి పని ప్రారంభించాం. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉంది. నాలాంటి పేదలు ఎందరో జగనన్నకాలనీలో ఇళ్లు కట్టుకుంటున్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతతోనే నా ఇంటిపై జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం వేసుకున్నాను.

– గండి బాలు, కోటేశ్వరదుర్గాపురం

మౌలిక వసతులు కల్పించాం



కొల్లేరు గ్రామాల్లో పేదలు ఇళ్లు కట్టుకోవాలంటే ఎంతో వ్యయమయ్యేది. కొల్లేరు ముంపుబారిన పడిన ప్రతిసారీ పేదల ఇళ్లు నీట మునిగిపోయేవి. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకాలనీలో ఇళ్ల స్థలాలను లక్షల రూపాయలు ఖర్చుచేసి మెరక చేశారు. పేదలు ఇప్పుడు ధైర్యంగా ఇళ్లు కట్టుకుంటున్నారు. కాలనీల్లో రోడ్లు నిర్మించారు. నిర్మాణ పనుల కోసం బోర్లు వేసి, వాటర్ సప్లై చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి అందరికీ విద్యుత్ ఇచ్చారు. అందుకే పేదలు సంతోషంగా ఇల్లు కట్టుకున్నారు.

– ముంగర తిమోతి, పైడిచింతపాడు, సర్పంచ్

జగనన్నతోనే సామాజిక న్యాయం

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సాధికారితకు పెద్దపీట వేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ రంగంలో అత్యధిక ప్రాధాన్యత కల్పించారని, ఆయనతోనే దళిత, బహుజనులకు న్యాయం చేకూరుతుందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఏలూరు నగర కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా సామాజిక న్యాయం చేసి చూపించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో ప్రాధాన్యత ఇవ్వగా, ఎస్సీలకు సైతం పూర్తిస్థాయిలో న్యాయం చేశారని వివరించారు. సమాజంలో అనేక ఏళ్లుగా రాజకీయ, ఆర్థిక, సామాజికంగా వెనుకబాటుకు గురయ్యే వర్గాలకు అండగా నిలిచారని చెప్పారు. ఏలూరు నగరంలోనూ దళిత సామాజికవర్గం తనకు ఎంతో అండగా నిలుస్తోందనీ, బీసీలు, ఎస్టీ, మైనార్టీ వర్గాలన్నీ తన విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు ఉన్నారు.



ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్నల జాన్‌గురునాథ్

అలరించిన ఘంటసాల నాటకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాలులో శనివారం రాత్రి ప్రదర్శించిన ఘంటసాల నాటకం ప్రజలను విశేషంగా అలరించింది. స్టేషన్ ఘనపూర్‌కు చెందిన శ్రీ సాయి సంతోషి నాట్య మండలి ఆధ్వర్యంలో ప్రఖ్యాత సురభి కళాకారులు మధుర గాయకుడు ఘంటసాల జీవిత చరిత్రను కళ్లకుకట్టినట్టు ప్రదర్శించారు. నాటక ప్రదర్శన సందర్భంగా ఏర్పాటుచేసిన సభా కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ తెలుగు సినిమా సంగీత ప్రపంచానికి మకుటం లేని మహా వ్యక్తిగా కీర్తిని అందుకున్న మధుర గాయకులు, సంగీత దర్శకులైన ఘంటసాల జీవిత విశేషాలపై నాటకంగా మలిచి ప్రదర్శించడం ఆనందదాయకమని తెలిపారు. తొలుత హిందూ యువజన సంఘం మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, సహాయ కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు జవ్వాజి మోహన్ విఠల్, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు తదితరులు జ్యోతి ప్రజ్వలనతో నాటకాన్ని ప్రారంభించారు. నాటక రచయిత భాస్కరుని సత్య జగదీష్, సురభి కళాకారుల బృందాన్ని దుశ్శాలువాతో సత్కరించి సంస్థ తరపున కళా బృందానికి ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో వేణుగోపాల్ లునాని, ఎల్ వెంకటేశ్వరరావు, లంక వెంకటేశ్వర్లు, కొమ్మన కొండబాబు, శలా రాజాబాబు, ఎ.పార్వతీ రామచంద్రన్, ఎం సూర్య నారాయణ యాదవ్, పెదపాటి రామకృష్ణ, గుడిపాటి లలితా శర్మ, ఘంటసాల పెద్దిరాజు, తల్లాప్రగడ సుబ్బారావు, కె.సాంబశివరావు, టి.శేషసాయి, ఆరేపల్లి రవి ప్రకాష్, టి.లోకేశ్వరరావు, చన్నా వెంకటరామయ్య, కళాకారులు, అధిక సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు.



ఘంటసాల నాటకంలోని ఓ సన్నివేశం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారం జనార్దన స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారి భారీ రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్ బజారు, అగ్రహారం, న్యూ మార్కెట్, గజ్జెల వారి చెరువు ప్రాంతం, గడియార స్తంభం ప్రాంతం, కుండీ సెంటర్, పెరుగు చెట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

- చెట్ల కొమ్మల తొలగింపు, వార్షిక మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంతం, జిల్లా కోర్టు ప్రాంగణం, కలెక్టర్ కార్యాలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

వైభవంగా శ్రీవార్ల కల్యాణ మహోత్సవం



స్వామి వార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక అగ్రహారం జనార్దన స్వామి, రంగనాయక స్వామి వార్ల తిరు కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్లకు జనార్దన స్వామి సుప్రభాత గోష్టి ప్రతినిధుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, నిత్యార్చన, సేవాకాలం, ఆరగింపు నిర్వహించారు. మంగళాశాసనాలు పలికి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయత్రం అర్చన హోమాదులు, సేవాకాలం, ఆరగింపు నిర్వహించారు. స్వామివార్లకు, అమ్మవార్లకు ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. స్వామివార్లకు, తాయార్లకు విశేష అలంకరణ చేశారు. రాత్రి కొనకళ్ల నాగవెంకట సుధాకర్ దంపతులచే పాంచరాత్రాగమ ప్రతిష్ట మహాదాచార్య యాజ్ఞిక బ్రహ్మ కొడవటికంటి వెంకట రాజన్ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరనం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణచేశారు. అర్చకులు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు టౌన్: నా బార్డు సంస్థ ద్వారా రుణాలిప్పిస్తానని పలువురు మహిళలను మోసగించిన నిందితుడిపై ఏలూరు త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు రిజిస్టర్ కార్యాలయం సమీపంలో జిరాక్స్ షాపు నిర్వహిస్తున్న సోమిశెట్టి నాగలక్ష్మికి పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన దొండపాటి ప్రభుదాసు పరిచయమయ్యాడు. నాగలక్ష్మికి తాను నాబార్డు ద్వారా రుణాలిప్పిస్తానని రూ.30 వేలు కడితే రూ.3 లక్షలు రుణం వస్తుందని ఆమెను నమ్మించాడు. ఆమె తనతో పాటు తనకు తెలిసిన పరిచయస్తులు, బంధువులు 17 మంది మహిళల వద్ద నుంచి మొత్తం రూ.4.36 లక్షలు సొమ్మును ప్రభుదాసుకు కట్టించింది. ఎన్ని రోజులు గడిచినా రుణాలు రాకపోవటంతో గట్టిగా నిలదీయటంతో నాబార్డు పేరిట ప్రభుదాసు వారికి నకిలీ చెక్కులు ఇచ్చాడు. వాటిని బ్యాంకుకు తీసుకువెళ్ళగా అవి చెల్లని చెక్కులని, నకిలీవని తెలియటంతో బాధితులు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు శనివారం ఏలూరు త్రీటౌన్ పోలీసులు ప్రభుదాసు పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్యాంకు అధికారినంటూ బురిడీ

ఏలూరు టౌన్: బ్యాంకు అధికారినంటూ ఒక వ్యక్తి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు నంబర్ అడిగి అప్‌డేట్ చేస్తానంటూ నమ్మించి అకౌంట్‌లోని నగదును స్వాహా చేశాడు. ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఒక బాధితుడు శనివారం ఫిర్యాదు చేశాడు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు సమీపంలోని ఇంద్రప్రస్థ వెంచర్ ప్రాంతానికి చెందిన బదురు వెంకటేశ్వరప్రసాద్‌కు ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు నెంబర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. రూ. 92వేల 650ల నగదును ప్రసాద్ బ్యాంకు ఖాతా నుంచి పలు దఫదఫాలుగా కాజేశాడు.బాధితుడు ఈ సంఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	22	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05,07,10
బెండకాయలు	22	కంద	74
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-40	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	44	అల్లం	160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32-38	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	24-26	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకదదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	06
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	12
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

రైల్వే, డిఫెన్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రైల్వే, డిఫెన్స్ ఉద్యోగాలకు సిద్ధమౌతున్న అభ్యర్థులకు తమ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు నగరానికి చెందిన ఫ్యూచర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సతీష్ సావిత్రి సరేళ్ల తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం రోడ్డులోని సీఎస్ఐ స్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ తరగతులను 6 నెలల పాటు కొనసాగించాలని నిర్ణయించామన్నారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బాణాల శంకరరావు, జిల్లా ఎన్‌జీఓ నాయకుడు చోడగిరి శ్రీనివాస్, వైమానిక దళ మాజీ అధికారి కసుకుర్తి లక్ష్మయ్య మాట్లాడారు. పూర్తి వివారాల కోసం ఫోన్ నెంబర్ 81439 74622లో సంప్రదించాలని సంస్థ కార్యదర్శి హుస్సేన్ కోరారు. నగరానికి చెందిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ అధ్యక్షుడు ఎండీ సులేమాన్, ముస్లిం జేఏసీ అధ్యక్షుడు ఇబ్రహీం, అక్బర్ మెడికల్ సంస్థ యజమాని బజిద్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి కూల్చివేత కథనాలు అవాస్తవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని గొల్లాయగూడెంలో మన్నా చర్చి కూల్చివేతపై యూట్యూబ్‌లో వస్తోన్న కథనాలు అవాస్తవమని పలువురు ఫాదర్లు ఖండించారు. మన్నా చర్చి కూల్చివేతలో మత సంబంధ సమస్యలేవీ లేవని, అవన్నీ కేవలం కల్పితాలని శనివారం వారొక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి అవాస్తవ వార్తలు ప్రచారం చేస్తే నమ్మవద్దని కోరారు. నగర ప్రజలందరూ ప్రేమ, సేవ, పరస్పర సహాయ సహకారాలతో, ఐక్యతతో, శాంతియుతంగా జీవిస్తున్నారని వివరించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఫాదర్లు బాల, ఐ.మైఖేల్, బుద్దుల అబ్రహాం, పీవీ రాజు, టి.శ్యాం బాబు, సుదర్శన బాబు, తిమోతి, బీరపోగు యోహాన్, ఇతర క్రైస్తవ సంఘాల పెద్దలు ఉన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు కృషి

భీమడోలు: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో అంగన్‌వాడీలు భాగస్వామ్యులు కావాల ని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కేవీ విజయలక్ష్మి అన్నారు. భీమడోలు, పాతూరు గ్రామా ల్లో పోష్టికాహార పక్షోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని భుజించడం వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి

ఏలూరు (టూటౌన్): ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే భగత్ సింగ్‌కు ఇచ్చే నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభ పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు బ్రిటీష్ వారి నుంచి విముక్తితో పాటు దేశంలో సమసమాజం స్థాపించాలని పోరాడారని రవి గుర్తుచేశారు. సీపీఐ ఆధ్వర్యంలో కొత్తపేట బొమ్మి రంగారావు స్మారక గ్రంథాలయం వద్ద భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఇప్టూ ఆధ్వర్యంలో చేపల తూము సెంటర్ నుంచి భగత్ సింగ్ విగ్రహం వద్ద వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లకు విప్లవ జోహార్లర్పించారు. ఇప్టూ నాయకులు కేవీ రమణ, బద్దా వెంకట్రావులు మాట్లాడారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సభ నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం, జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడారు. ప్రధాని మోదీ నిరుద్యోగులను మోసం చేశారని, వ్యవసాయ రంగాన్ని కూడా బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు.

ఎన్నికల కోడ్ విధిగా పాటించాలి

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా పాటించాలని, రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, సిబ్బంది ఎన్నికల కోడ్ పరిధిలో ఉంటారని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి మేరుగు ముక్కంటి అన్నారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. దివంగత రాజకీయ నేతల విగ్రహాలు, శిలా ఫలకాలపై ఎలాంటి ఆంక్షలు లేవని అన్నారు. కొత్తగా ప్రభుత్వ కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయరాదన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై తమకు నేరుగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఏలూరు నియోజకవర్గంలో సుమారుగా 2.30 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 212 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు, విభిన్న ప్రతిభావంతుల కోసం ర్యాంపులు, వీల్‌చైర్లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలుపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా తప్పుడు ప్రచారాలతో కూడిన పోస్టింగులు పెడితే చర్యలు తప్పవని, రెండు కులాలు, మతాలు, వర్గాల మధ్య వైషమ్యాలు సృష్టించేలా ఏదైనా తప్పుడు ప్రచారం చేస్తే ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని వెంకటకృష్ణ, ముక్కంటి హెచ్చరించారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటకృష్ణ, ఆర్ఓ మేరుగు ముక్కంటి